
ప్రజాశక్తి

బుధవారం 26 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం



రంగంవలస కొండల్లో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన రంగంవలస సమీప కొండల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. దీంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. ఏనుగుల సంచారంతో అటవీ ఉత్పత్తులను సేకరించేందుకు గిరిజనులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పొలాలకు వెళ్లాలన్నా భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల ఘీంకారాలతో ఆందోళన చెందుతున్నారు.

- ఉన్న స్థానాల్లో కొనసాగేందుకు కొందరు యత్నం
- జిల్లాకు వచ్చేందుకు పాతవారు ప్రయత్నం
- వైసిపి ముద్రపడిన అధికారుల్లో ఆందోళన
- అమాత్యుని అపాయింట్‌మెంట్ల కోసం ఎదురు చూపులు



అందరినోటా బదిలీల మాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా, మండలస్థాయి అధికారులందరి నోటా బదిలీల మాట వినిపిస్తోంది. జిల్లాలోని కొంతమంది అధికారులు యథాతథ స్థానాల్లో కొనసాగేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి, ప్రస్తుతం ఇతర జిల్లాల్లో ఉన్న అధికారులు కొంతమంది తిరిగి యుటర్న్ తీసుకునేందుకు సిద్ధమౌతున్నారు. గత ఐదేళ్లలో వైసిపి నాయకుల వద్ద స్వామి భక్తి ప్రదర్శించినవారిలో మాత్రం బెంగ మొదలైంది. ముఖ్యంగా జిల్లా అధికారులెవరికీ ఇప్పటి వరకు ఎలాంటి హామీలూ దక్కలేదు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి నిన్నమొన్నటి వరకు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం.

ప్రభుత్వం మారినప్పుడు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు మొదలుకుని జిల్లా, మండల స్థాయి అధికారుల వరకు బదిలీలు సర్వ సాధారణం. ఈ క్రమంలో ఉద్యోగులు తమకు అనుకూలమైన శాఖల్లోకి, ప్రాంతాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం బదిలీపై గుంటూరు వెళ్లారు. ఆమె స్థానంలో నూతన కలెక్టర్‌గా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజుల్లో ఎస్‌పికూడా బదిలీ అవుతారనే ప్రచారం జరుగుతోంది. ఇక జిల్లా అధికారులైతే ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచే తాము కోరుకున్న ప్రాంతానికి లేదా శాఖలకు వెళ్లేందుకు, ఉన్న స్థానంలో యథాతథంగా కొనసాగేందుకు తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు, వారి తరపున నాయకులు గత కొద్దిరోజులుగా మంత్రులను, ఎమ్మెల్యేలను, ఎంపీలను కలుస్తున్నారు. ముఖ్యంగా మంత్రులిద్దరూ పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే శాసన సభ సమావేశాలు ప్రారంభం కావడం, ఆ తరువాత మంత్రివర్గ సమావేశంలో పాల్గొనడంతో జిల్లాకు రావడం ఆలస్యమైంది. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీనివాస్ సోమవారం జిల్లాకు వచ్చారు. ఈనేపథ్యంలో అధికారులంతా మంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు మంత్రి శ్రీనివాస్‌ని కలిసిన కొంతమంది అధికారులు తమకు ఎలాంటి హామీ రాలేదని చెబుతుండగా, కొంతమంది ఎలా స్పందిస్తారో అంటూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తమ మనసులో మాట చెప్పుకునేందుకు మంత్రి ప్రత్యేకమైన అపాయింట్‌మెంట్లు ఇవ్వాల్సివుంది. అపాయింట్‌మెంట్లన్నీ గుంపులో గోవిందలా ఉంటే మనసు విప్పిమాట్లాడే పరిస్థితి దక్కదని అధికారులు చర్చించు కుంటున్నారు. ఇందుకు మంత్రి కొంత సమయం కేటాయించకపోతే అధికారులు ఇబ్బందులు పడడంతోపాటు షోకాల్డ్ అధికారులు, దిగువ స్థాయి నాయకులు పైరవీలకు తెరలేపే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఒక అధికారి తనకు అత్యంత సన్నిహితంగా ఉండే మరో దిగువ స్థాయి అధికారిని వెంటబెట్టుకుని ఏకంగా జిల్లా కలెక్టర్ (ఎస్.నాగలక్ష్మి)తో ఒక కీలకశాఖ పోస్టింగ్ కోసం పైరవీలు చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే కలెక్టర్ సున్నితంగా తిరస్కరించారట. కొందరు నాయకులు కూడా అధికారులకు హామీలు ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బదిలీల వ్యవహారం విషయంలో మంత్రి స్పీడ్ గేర్ మార్చాల్సివుందని చర్చనడుస్తోంది. మరోవైపు గజపతినగరం నియోజకవర్గంలో మండల స్థాయి పోస్టుల కోసం ప్రయత్నిస్తున్న అధికారులు కూడా మంత్రి ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్నారు.

సిబ్బంది పనితీరు భేష్ : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ఎలక్షన్ సెల్, ఎస్‌బి, డిసిఆర్‌బి, ఎఆర్ పోలీస్ శాఖ యంత్రాంగం పనితీరు భేష్‌గా ఉందని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ కొనియాడారు. అంతేకాక అన్ని విభాగాలు సమిష్టి కృషి, సమన్వయంతో పని చేయడం వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయాల కాన్ఫరెన్సు హాల్‌లో మాసాంతర నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ హెూంగార్డు నుంచి అధికారుల వరకు కూడా ఆత్మస్థైర్యంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఎన్నికలు, కౌంటింగ్ రోజుల్లోనూ, కౌంటింగ్ అనంతరం ఎలాంటి ఘటనలు జరగకుండా బాగా కష్టపడి విధులు నిర్వహించారని కొనియాడారు. ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించి, వారికి ప్రోత్సాహక బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేసారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పని చేయాలని, ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పని చేయాలని ఆదేశించారు. అనంతరం, గతంలో నమోదైన తీవ్రమైన నేరాల్లో నమోదైన కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, ఆయా కేసుల్లో సాధించిన పురోగతిని సంబంధిత దర్యాప్తు అధికారులను అడిగి తెలుసుకొని, కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించి, దర్యాప్తు అధికారులకు విక్రాంత్ పాటిల్‌దిశా నిర్దేశం చేసారు. అనంతరం ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, డిఎస్‌పిలు ఎస్ఆర్ హర్షిత, జివి కృష్ణారావు, జి.మురళీధర్, ఎస్.వెంకట అప్పారావు, సిఐలు సిహెచ్.లక్ష్మణ రావు, బిఎండి ప్రసాద్ రావు, ఎఆర్ ఆర్ఐ శ్రీరాములు, శ్రీనివాసరావుతో పాటు పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఎస్‌పి నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సాలూరు టౌన్ సిఐ వాసునాయుడు

టౌన్ సిఐకి ప్రశంసాపత్రం

సాలూరు: ఇటీవల ముగిసిన ఎన్నికల్లో శాంతి భద్రతల పరిరక్షణలో విధులు సక్రమంగా నిర్వహించిన టౌన్ సిఐ వాసునాయుడుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ విధుల్లో చేరిన సిఐ పట్టణంలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో ఆయన్ను ఎస్‌పి అభినందించారు. అలాగే పట్టణ ఎస్ఐలు కెవి సురేష్, సీతారాములు, పాచిపెంట ఎస్ఐ నారాయణరావుకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

వైసిపి జిల్లా కార్యాలయానికి నోటీసులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 16వ వార్డులో సాయి నగర్ కాలనీకి ఆనుకుని ఉన్న జంఝావతి నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించిన స్థలంలో నిర్మించిన వైసిపి జిల్లా కార్యాలయానికి మున్సిపల్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఈ స్థలాన్ని లీజు ప్రాతిపదికన తీసుకొని వైసిపి జిల్లా కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. అయితే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు పొందకుండా కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టడంతో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి పి. కనకారావు సూచనల మేరకు సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు జిల్లా కార్యాలయం భవనం లోపల నోటీసులు అందజేశారు. మరొక నోటీసును జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు రిజిస్టర్ పోస్టు ద్వారా అందజేస్తున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.



కురుపాంలో కురుస్తున్న భారీ వర్షం

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

మంగళవారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరితో అల్లాడుతున్న నేపథ్యంలో సాయంత్రం ఆకాశం పూర్తిగా మబ్బులు మాయమై భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది.

సీతంపేట : సీతంపేట ఏజెన్సీలో మంగళవారం వర్షం కురిసింది. ఉదయం ఎండ కాసినప్పటికీ చుట్టుపక్క గ్రామాల్లో వర్షం కురిసింది. ఇప్పటికే ఏజెన్సీలో వర్షం సరిగ్గా పడకపోవడంతో విత్తనాలు జల్లేందుకు దుక్కులు కాలేదు. చుట్టు పక్క మండలాల్లో వర్షం కురిసినప్పటికీ సీతంపేటలో వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. అయితే మంగళవారం వర్షం కురవడంతో రైతులకు కొంతమేర ఊరట లభించింది.

లక్షా 75 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు లక్షా 75 వేల ఎకరాల్లో రైతులు ప్రణాళిక చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. మంగళవారం ఆయన తన పర్యటనలో భాగంగా గుమ్మలక్ష్మీపురం వ్యవసాయ శాఖ కార్యాలయం సందర్శించి స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ముందు అన్ని రకాల విత్తనాలు ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గత ఏడాది లక్షా 13 ఎకరాల్లో ఖరీఫ్ సాగు రైతులు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది 1,75,000 ఎకరాల్లో సాగవుతుందన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపేట వేస్తుందని, రైతులకు అన్ని రకాలుగా సహాయం చేస్తూ రుణమాఫీ, యాంత్రీకరణ పరికరాలను అందించే దిశగా కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ ఏడాది లక్షా 11 ఎకరాల్లో పత్తి సాగు 7వేల మంది రైతులు సాగు చేయగా, 2వేల ఎకరాల్లో 1800 మంది రైతులు చెరకు సాగును వేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే జిల్లాలో 12వేల ఎకరాల్లో అరటి పంటను 7800 మంది రైతులు సాగు చేస్తున్నట్లు తెలిపారు. 306 రైతు భరోసా కేంద్రాల్లో 22,131 క్వింటాల వరి విత్తనాలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్న 15 మండలాల్లో రెండు లక్షాల 20 వేలు ఎకరాల్లో ఖరీఫ్ సాగువుతుందని చెప్పారు. 19 క్వింటాల పచ్చి రొట్ట విత్తనాలను 6600 మంది రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఖరీఫ్ సీజన్లో దష్టిలో ఉంచుకుని 45 వేల టన్నుల ఎరువులను ముందస్తుగా అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. సమావేశంలో కురుపాం ఎడి నిర్మల జ్యోతి, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి వ్యవసాయ శాఖ అధికారులు శంకర్రావు, సిహెచ్. ప్రసాద్, విజయనిర్మల, తదితరులు ఉన్నారు.

ఎరువులు ధరలు ఇవి...

ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఎరువుల ధరలు ఇలా ఉన్నాయి. యూరియా రూ.267, డిఎపి రూ.350, 10-26-26 రకం రూ.1470, 28-20-01-3 రకం రూ.1256, 28-28-0 రూ.1300, పొటాషియం రూ.1625గా ఉన్నాయని తెలిపారు. అలాగే సూపర్ పాస్పేట్ రూ.600.

విద్యార్థుల నమోదు పెంపే లక్ష్యం : డిఇఒ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, చేరికల శాతం పెంచడమే లక్ష్యంగా జిల్లాలో విద్యా ప్రవేశ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ జూన్ 24 నుంచి జూలై 25 వరకు జరిగే ఈ విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను ముమ్మరం చేస్తామన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేస్తే ఎప్పటికప్పుడు వివరాలను దీక్ష ప్లాట్ఫారంలో నమోదు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత ఐదేళ్ల నమోదు డేటా సేకరణ, విశ్లేషణ, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులతో సమావేశాలు నిర్వహించడం, చర్చించడం ఈ సమావేశంలో ఈ సంవత్సరం నమోదు లక్ష్యాలను నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేయడం ప్రతి సభ్యునికి బాధ్యతన్నారు. విభజించి కార్యకలాపాల కోసం ప్రణాళిక చేయడం ఈ కార్యకలాపాలను నిర్వహించడానికి సమయ పట్టికలను తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి కార్యకలాపాలను నమోదు చేయడంతో పాటు, బడికి రాని, బడిలో నమోదు కానీ పిల్లల ఇళ్లకు వెళ్లి వారు బడికి వచ్చేలా చేయడానికి చర్యలు చేపడతామన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి బడి ఈడు పిల్లలను బడిలో నమోదు చేసుకోవడం, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే పిల్లల ఇళ్లకు వెళ్లి మన ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులను, మన పాఠశాల సాధించిన విజయాలను, మన ఉపాధ్యాయుల సామర్థ్యాలను తెలియజేసి వారి తల్లిదండ్రులకు వివరించి మన పాఠశాలల్లో చేరేలా చేయడం, మన పాఠశాలల్లో కొన్ని కార్యక్రమాలను నిర్వహించడం, రోజువారీ నమోదు వివరాలను పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించడం ప్రతి ప్రధానోపాధ్యాయులు తప్పకుండా విద్యాప్రవేశం కార్యక్రమాలు, విద్యార్థుల నమోదులను దీక్ష యాప్ లో నమోదు చేయాలని ఆమె తెలిపారు.



అదనపు భవన పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

నిర్మాణాల్లో నాణ్యతా లోపాలపై అసంతృప్తి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పెరుగుతున్న రోగుల దృష్ట్యా గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం ఆమె భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రోగులు, అవుట్ పేషెంట్లపై ఆరా తీశారు. ఆస్పత్రిలో రోగులకు ఎటువంటి సేవలు అందిస్తున్నారు, మందులు అందుబాటులో ఉన్నాయా లేదా కనీస సౌకర్యాలపై ఆమె పరిశీలించారు. అనంతరం వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో మలేరియా, డెంగీ మందులు రోగులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆమె వైద్యులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగుల సంఖ్య, సౌకర్యాలపై చర్చించారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో రోగులకు మంచాలు ఏర్పాటు చేయాలని అలాగే ఆసుపత్రిలో తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆమె చిన్నపిల్లల (ఎస్ఎన్‌సియు) వార్డును, వైద్యం పొందుతున్న చిన్నారులను పరిశీలించి సేవలపై ఆరా తీశారు. అనంతరం కొత్తగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి, అదనపు భవనాలను పరిశీలించారు. ఆయా పనుల్లో నాణ్యతా లోపం కనబడుతుందని మండిపడ్డారు. ఆసుపత్రి నిర్వహణలో ఒంటి గోడ నిర్మాణాలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటువంటి నిర్మాణాలు జరిగితే రాబోవు రోజుల్లో పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని, దీనిపై సమగ్ర నివేదిక తనకు అందించాలని ఎమ్మెల్యే సంబంధిత ఎపిఐఐఎండిసి అధికారులను ఆదేశించారు. 2021లో నిర్మాణ పనులు పూర్తి చేపట్టాల్సిన ఉండగా, నేటి వరకు ఆయా పనులు జరగకపోవడం పట్ల సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో ఆమె ఫోన్లో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈమె వెంట ఆస్పత్రి డ్రాయింగ్ ఆఫీసర్ వైద్యులు త్రివేణి, రమ్య, ధరణి, రవికుమార్, టిడిపి నాయకులు వెంపటాపు భారతి, పోలూరు శ్రీనివాసరావు, మండంగి భూషణరావు, జనసేన నియోజకవర్గ నాయకులు కడ్రక మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు నిర్ణయాలతో..

క(న)ష్టాలకు గురవుతున్న కేబుల్ ఆపరేటర్లు

పలు న్యూస్ ఛానళ్ల నిలిపివేత

ప్రజాశక్తి - మక్కువ

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉంది ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు. ప్రభుత్వాల నిర్ణయాల వల్ల తాము అష్ట కష్టాలు ఎదుర్కోవలసి వస్తోందని పలువురు కేబుల్ ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కొన్ని న్యూస్ ఛానల్‌ను ప్రచారం కాకుండా నిలిపివేయడం, అలాగే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా అదే తరహాలో నిర్ణయం తీసుకొని మరికొన్ని న్యూస్ ఛానళ్ల ప్రసారం కాకుండా నిలిపేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల వినియోగదారులు మల్టీ నేషనల్ కంపెనీలైన డిటిహెచ్‌లవైపు వెళ్లిపోతున్నారని, దీంతో కేబుల్ ఆపరేటర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారంతా కలత చెందుతున్నారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు నష్టం చేకూరుస్తుంటే ఇప్పటికే ఎపిఎస్ఎఫ్ఎల్ పలు కేబుల్ టీవీ యాజమాన్యాలు విపరీతమైన ధరలు పెంచుతూ ఆపరేటర్ నడ్డి పిలిచారని వారు ఆవేదన చెందుతున్నారు. వినియోగదారులకు కావాల్సిన చానళ్లను అందించడంలో కేబుల్ వ్యవస్థ ఎప్పుడు ముందుండేదని, అదే ధరలను కూడా వినియోగదారులకు తక్కువగా అందించేదని వారు అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ కేబుల్ వినియోగదారుడు ఆశించిన రీతిలో ప్రసారాలు రాకపోవడంతో ఆగ్రహం చెందుతున్నారు. దీంతో అనుకూల ప్రసారాల మార్గాన్ని ఎంచుకుంటూ కేబుల్ వ్యవస్థకు దూరమవుతున్నారు. ప్రభుత్వాలు సక్రమంగా అన్ని టీవీ ఛానల్‌లో ప్రసారం జరిగేలా చర్యలు చేపట్టి కేబుల్ ఆపరేటర్లు పడుతున్న ఇబ్బందులకు గురికాకుండా చూడాలని, తద్వారా వినియోగదారులకు కూడా మేలు చేకూర్చాలని వారంతా కోరుతున్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - సీతానగరం



రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ పగడాలమ్మ

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని డిఇఒ జి.పగడాలమ్మ అన్నారు. మండల కేంద్రమైన సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని విద్యార్థులకు బోధనా సామగ్రిని ఉపయోగించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జులై ఒకటి నుండి స్టాప్ డయేరియా కార్యక్రమంలో అందరూ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల యాజమాన్యాన్ని నిలదీస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు

పాఠశాలల్లో పుస్తక విక్రయాలు ఆపాలి

- శ్రీకృష్ణ స్కూల్లో ఎస్ఎఫ్ఐ ఆందోళన
- బుక్స్ సీజ్ చేసిన విద్యాశాఖాధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న శ్రీకృష్ణ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు మాట్లాడుతూ ప్రతిఏటా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులను నిలువు దోపిడీ చేయడానికి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాల అమ్మకాలు చేపడుతున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చేన ఫిర్యాదు ఆధారంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్న గదులను గుర్తించామ న్నారు. ఇప్పటికే ట్యూషన్ ఫీజుల రూపంలో వేలల్లో వసూలు చేస్తున్నా, పుస్తకాలు, యూనిఫాంల రూపంలో అదనంగా మరో రూ.20వేలు వసూలు చేస్తున్నాయని తెలిపారు. తక్షణమే జిల్లా వ్యాప్తంగా పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని, వాటి లైసెన్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల యాజమాన్యులు విద్యార్థుల ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకొని పుస్తకాల అమ్మకాలు ఆపాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాలలో పుస్తకాలను అమ్ముతున్న రూమ్ లను సీజ్ చేయించి పాఠశాలను లైసెన్స్ రద్దు చేసేలా పోరాడుతామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు మేరకు డిప్యూటీ ఎంఇఒ కె.ప్రసాద్ ఘటన స్థలానికి వచ్చి శ్రీకృష్ణ పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్న గదులను సీజ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సింహాచలం, టి.అఖిల్, పట్టణ కమిటీ సభ్యులు లావణ్య, సూర్య, రవి, సంజీవ్, ఐబో పాల్గొన్నారు.


ఎస్‌పిడికి వినతిని అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాతృభాషా వాలంటీర్లు

సిఆర్‌టిల మాదిరిగానే గుర్తించాలి

ఎస్‌పిడికి మాతృబహుభాషా వాలంటీర్లు వినతి

ప్రజాశక్తి – సీతంపేట

సిఆర్‌టిల మాదిరిగానే తమను కూడా గుర్తించాలని మాతృభాషా వాలంటీర్లు విజయవాడలోని ఎస్‌పిడికి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన సర్వ శిక్ష అభియాన్ ఎస్‌పిడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేసి తమను సిఆర్‌టిల మాదిరిగా గుర్తించి వారితో వేతనం మంజూరు చేయాలని కోరారు. అలాగే డిఎస్‌సిలో ఈ సర్వీసును పరిగణలోకి తీసుకొని అదనపు మార్కులు వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి ఎస్‌పిడి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిని అందజేసిన వారిలో ఆదివాసీ మాతృ బహుభాషా ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర సంఘం నాయకులు మర్రి బిబ్బిబాబు, పాంగి శ్రీను, పాంగి. కుమారి, పాడేరు ఐటిడిఎ శాఖ అధ్యక్షులు సవర ఆనందరావు, బిడ్డిక వెంకటేష్, శ్రీకాకుళం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి – బలిజిపేట

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపిసి గ్రూపులో చదివిన విద్యార్థులు ఇఎపిసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం ఆరుగురు విద్యార్థినీలు మెరుగైన ర్యాంకులు సాధించారు. ఈ విషయంపై జిల్లా వృత్తి విద్య అధికారి మంజులవీణ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జ్యోతి, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

ఆక్రమిత చెరువుల పరిశీలన

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

గత ప్రభుత్వ హయాంలో పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు చెరువులు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయం ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కె.ఆనందరావు పట్టణంలోని బెలగాంలో ఉన్న లక్ష్మీ నాయుడు చెరువును తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆక్రమణలు గురైనట్లు గుర్తించి, తదుపరి చర్యల కోసం పై అధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులతో పాటు ప్రభుత్వానికి చెందిన స్థలాలు ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి – సీతంపేట

పాతపట్నం మండలం బొమ్మిక ఆశ్రమ పాఠశాల, లాభర ఆశ్రమ పాఠశాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డ్రాపౌట్స్ నివారించాలన్నారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని కోరారు. దీనికి తల్లిదండ్రులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు, ఎటిడబ్ల్యుఒ కృష్ణవేణి, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ సిహెచ్ చిరంజీవులు, కోఆర్డినేటర్ ముకుందరావు, లాభర హెచ్‌ఎం పి.సూర్యం, బొమ్మిక హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పంచాయతీ సిబ్బందికి వినతిని అందజేస్తున్న కాలనీవాసులు

దళితవాడలో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి – వీరఘట్టం

తమ వీధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వీరఘట్టంలో గల బాబు జగజ్జీవన్ రాం కాలనీకి చెందిన దళితులు మంగళవారం మేజర్ పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలం నుంచి రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సక్రమంగా రావడం లేదని, ఎగువ ప్రాంతానికి వచ్చి నీరు పట్టుకుని దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వీధి దీపాలు కూడా వెలగడంలేదన్నారు. శ్మశాన వాటికకు మృత దేహాలను తరలించేందుకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రస్తుతం రహదారి ఉన్నప్పటికీ పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో ఎస్.శశిభూషణరావు, ఎన్.కల్యాణ్, దాలయ్య, ఏసేబు, ప్రసాదు, ఎన్.కుమారి, శేషమ్మ, లక్ష్మి, పార్వతమ్మ, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడి మారమ్మ పండగ

ప్రజాశక్తి – కురుపాం

కురుపాంలో పైడిమారమ్మ ఒంటిగటం పండుగ మంగళవారం పైడి మారమ్మ అనువంశిక నిర్వాహకుడు బూరుబ నారాయణరావు ఆధ్వర్యంలో తాళమేళాలు, విచిత్ర వేషధారణలతో ఘనంగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం ఊరంతా పైడిమారమ్మ దేవత పండగలు తెచ్చామన్నారు. ఈ పండగ తెచ్చి అనేక ఏళ్లయిందని, కావున ఒక్కరోజు ఒంటిగటం పండగ తెస్తున్నామని తెలిపారు. దీంతో వర్షాలు బాగా పడి పంటలు బాగా పండి ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉంటారని ప్రతి బుధవారం అనుపు పండుగ నిర్వహిస్తున్నామని తెలిపారు.


గ్రామ వీధుల్లో వేషధారణల సందడి

చేతుల శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్


స్టాప్ డయేరియా పేరిట కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం జిల్లావ్యాప్తంగా చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అంగన్వాడీ కేంద్రంలో, పాఠశాలల్లో చేతుల శుభ్రతపై చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రులకు తగు సూచనలు ఇచ్చారు. శుభ్రత, వ్యక్తిగత పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. స్టాప్ డయేరియా కాంపెయిన్‌లో భాగంగా తాగు నీటి పరీక్షలతో సహా చేతుల శుభ్రతపై అంగన్వాడీ, పాఠశాల విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు డయేరియా నివారణ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని మండలాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి అతిసార ప్రబలేందుకు అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి అక్కడ ఉన్న చెత్తను శుభ్రం చేయాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. పూడికలు తొలగించడం, ముఖ్యంగా మార్కెట్లు, ఆహార పదార్థాలు విక్రయించే స్థలాలు, మురికివాడలు, తాత్కాలిక నివాసాల వద్ద దృష్టి సారించారు. ప్రజా మరుగుదొడ్ల శుభ్రతపై దృష్టి సారించారు. అన్ని తాగునీటి వనరులపై దృష్టి సారించి, సమయానుసారంగా క్లోరినేషన్, తాగు నీటి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మే చివరి వారం నుండి నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమంలో దాదాపు అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. బావులు, బోరు బావులు, కొళాయిలను తనిఖీ చేసి క్లోరినేషన్ చేశారు. తాగు నీరు మురికి నీటిలో కలుషితం కావడం వల్ల ప్రబలేందుకు ఎక్కువ అవకాశాలు ఉండడంతో వాటిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇంజినీరింగ్ సహాయకులు నీటి వనరులు నుంచి కుళాయి వరకు అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లను తనిఖీ చేశారు.

ఉపాధి అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి – జియ్యమ్మవలస

ఈనెల 23న కుందర తిరువాడ పంచాయతీలో ఉపాధి హామీ చట్టం అక్రమాల పుట్ట అన్న 'ప్రజాశక్తి' వార్తకు స్పందించిన అధికారులు మంగళవారం ఎపిఒ శ్రీనివాసరావు, అంబుడ్స్ మెన్ సన్యాసిరావు విచారణ చేపట్టారు. గ్రామంలో కొంతమంది వేరే చోట జీవనం సాగిస్తూ ఉపాధి పనికి హాజరైనట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగ నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేతనదారులతో విచారణ చేపట్టారు. ఈ ఆరోపణలకు సంబంధించిన వారి నుంచి లిఖితపూర్వక పత్రాన్ని తీసుకొని తగిన ఆధారాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఇకపై గ్రామంలో ఉపాధి హామీ పనికి రాని వారి పేర్లను నమోదు చేస్తే ఊరుకునేదని, ఎవరైతే గ్రామంలో లేకుండా పనికి వచ్చినట్లు హాజరు వేస్తారో అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లను హెచ్చరించారు.


వేతనదారులను విచారిస్తున్న అధికారులు


చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ విజయపార్వతి

జ్వరాలు అదుపులో ఉండేలా చర్యలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం/కురుపాం

సీజనల్ జ్వరాలు అదుపులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి అన్నారు. ఈమేరకు ఆమె మంగళవారం కురుపాం, గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి ప్రతిరోజూ జ్వర లక్షణాలతో ఎంతమంది వస్తున్నారు, ఏ విధమైన జ్వరాలుగా గుర్తిస్తున్నారు, వారికి అందజేస్తున్న చికిత్స, ఏ ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తున్నారు మొదలగు వివరాలను ఆరాతీశారు. ల్యాబ్‌ని తనిఖీ చేసి జ్వర నిర్ధారణ పరీక్షలు చేస్తున్న తీరును అడిగి, అక్కడ ఉన్న రక్త పూతల స్లైడ్‌లను పరిశీలించారు. మలేరియా జ్వర నిర్ధారణ విషయంలో జాప్యం లేకుండా సకాలంలో పరీక్షలు జరపాలని ఆదేశించారు. ప్రసూతి గది, రక్తనిధి కేంద్రం, వార్డులను తనిఖీ చేసి ప్రతినెలా జరుగుతున్న ప్రసవాల వివరాలను తెలుసుకున్నారు. జ్వరాలు, డయేరియా తదితర సీజనల్ వ్యాధులతో వచ్చే రోగులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొండెంఖల్లు పిహెచ్‌సిని తనిఖీ చేసి ల్యాబ్,ప్రసూతి గది తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్లు డాక్టర్ శోభారాణి, డాక్టర్ త్రివేణి, వైద్యాధికారి డాక్టర్ హర్ష, ఎంఎల సూర్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత తాగునీరు సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ అకిబ్ జావేద్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సిబ్బందికి వర్షాకాలం సమీపిస్తున్న కారణంగా వ్యర్థ పదార్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులు, కాలువల్లో మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని ఆదేశించారు. అలాగే తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, జ్వరాలు, విరోచనాలు సంభవించిన గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా వెంటనే పై అధికారులకు తెలియజేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అకిబ్‌జావెద్

నీటి పరిరక్షణ అందరి బాధ్యత

సీతంపేట : నీటిని పరిరక్షించడం అందరి బాధ్యతని ఎంపిడిఒ కె.గీతాంజలి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎన్‌ఆర్ఇజిఎస్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరితగతిన కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణాలను మొదలుపెట్టి పూర్తి చేయాలన్నారు. భూగర్భ జలాలను పరిరక్షించేందుకు, నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా భూమిలోకి తిరిగి చేరేందుకు అంతా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పాపారావు, ఎపిఒ సాగర్, వెలుగు సిసి శేషగిరి సోప్ పిట్ ఆవశ్యకతను గిరిజనులకు వివరించారు.


వివిత్రవేషాదరణలో నిరసన తెలుపుతున్న సాంబమూర్తి

గోతులు కప్పాలంటూ వినూత్న నిరసన

ప్రజాశక్తి –కొమరాడ

ఆంధ్రా– ఒడిశా అంతరాష్ట్ర రహదారిపై ఉన్న గోతులను కప్పాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పడిన రహదారి గోతుల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో వినూత్న రీతిలో ఆకులు కట్టుకొని గోతులో ఉన్న నీటిలో ఈత కొడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ కొమరాడ పోలీస్ సిబ్బంది ఎటువంటి అనుమతులు ఇవ్వకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఎటువంటి ఇబ్బంది పడకుండా వినూతన రీతిలో నిరసన చేపట్టినట్లు తెలిపారు. మండల కేంద్రానికి అతి సమీపంలో గల అంత రాష్ట్ర రహదారిపైన సోమవారం కురిసిన వర్షానికి గోతిలో నీరు ఉండిపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారిపైన ఆర్తాం, కోటిపాం, గుమడాం, కొమరాడ, బంగారంపేట, చోళపదం, కూనేర గ్రామాల వద్ద పెద్ద పెద్ద గోతులు పూడ్చకపోవడంతో రెండున్నరేళ్లుగా వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురై పలువురు క్షతగాత్రులు కాగా, మరికొంతమంది మృత్యువాతపడుతున్నారు. ఇలాంటి సందర్భంలో పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్లు మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేకుంటే ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, ఉపేంద్ర, పలువురు ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

15 రోజులకొకసారి రిజర్వాయర్లను శుభ్రపర్చాలి

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో గల నాలుగు పెద్ద రిజర్వాయర్లను, ఒక మినీ రిజర్వాయర్‌ను ప్రతి 15 రోజులకొకసారి మున్సిపల్ ఇంజనీరింగ్ తాగునీటి విభాగం సిబ్బందిచే శుభ్రం చేసే దిశగా చర్యలు చేపట్టాలని కమిషనర్ కె.శ్రీనివాస్ మున్సిపల్ డిఇ పి.కిరణ్‌కుమార్‌తో అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం పట్టణంలో గల తాగునీటి సరఫరా చేసే రిజర్వాయర్లలో జరుగుతున్న పరిశుభ్రత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తోటపల్లి పంప్ హౌస్ నుంచి జరుగుతున్న నీటి సరఫరాలో మట్టి వ్యర్థాలు రిజర్వాయర్ లోపల భాగంలో పేరుకుపోయిన సందర్భాల్లోనూ రంగు మారిన తాగు నీరు సరఫరా జరిగే అవకాశం ఉందని, ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి 15 రోజులకొకసారి రిజర్వాయర్లను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టాలని అన్నారు. దీంతో పాటు వార్డు సచివాలయాల ఎమినిటీ సెక్రటరీల ద్వారా వాటర్ పైప్ లైన్ లీకేజీలను గుర్తించి వాటి మరమ్మతులు చేయించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. క్లోరినేషన్ సక్రమంగా జరిపించాలని, వార్డు సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు, మేస్త్రీలు దగ్గరుండి వార్డుల్లో గల కాలువల్లో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే కాలువల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు

చదువుతోపాటు కూరగాయల సాగుపై ఆసక్తి

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని మండ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో పండిస్తున్న వివిధ రకాలైన కూరగాయల మొక్కలను, తోటను ఆయన పరిశీలించారు. విద్యార్థులు చదువు పాటు కూరగాయల సాగు చేయడం ఆనందంగా ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఎరువు లేని పంటలను పండించి రోగాలకు దూరంగా ఉండొచ్చని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాలక దేవానంద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గర్భిణుల వసతి గృహానికి వైద్య పరికరాలు వితరణ

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

స్థానిక వైటిసిలో నిర్వహిస్తున్నట్టు గర్భిణుల వసతి గృహంలో ఉంటున్న గర్భిణులకు పండ్లు, వైద్య పరికరాలు జనసేన తరుపున గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జనసేన నాయకులు, అక్షయ ఫౌండేషన్ చైర్మన్, కన్స్ట్రక్షన్స్ అధినేత ఏగిరెడ్డి తిరుపతి నాయుడు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ కద్రక మల్లేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి నాయుడు మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా నిరుపేద గిరిజన గర్భిణులకు గృహాన్ని నారా చంద్రబాబు నాయుడు 2018లో ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటి వరకూ 1900 మంది గర్భిణులకు సుఖ ప్రసవాలు జరగడం అభినందనీయమని అన్నారు. ఇన్‌ఛార్జి మల్లేష్ వసతిగృహంలో ఉన్న గర్భిణులకు పోషకాహారం, ఆరోగ్య జాగ్రత్తల గురించి తగు సూచనలు చేశారు. ముమ్ముందు ఈ వసతిగృహానికి అక్షయ ఫౌండేషన్ నుంచి గర్భిణులకు విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్ కూడా అందజేస్తామని తెలిపారు.


గర్భిణికి వైద్యపరికరాలు అందజేస్తున్న మల్లేశ్వరరావు, తిరుపతినాయుడు

కార్యక్రమంలో గరుగుబిల్లి మండల జనసేన అధ్యక్షులు శంకర్రావు, అధికారి అనిల్, యువత శిక్షణ కేంద్రం మేనేజర్ అన్ను రాము, సిబ్బంది, గ్రామ యువత పాల్గొన్నారు.

అతిసార నియంత్రణపై శ్రద్ధ పెట్టాలి : డిపిఒ

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

మండలంలో అతిసారం నియంత్రణకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశం మందిరంలో స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు. స్టాప్ డయరియా కార్యక్రమానికి మండలంలోని వైద్య సిబ్బందితో పాటు విద్య, స్త్రీ, శిశు సంక్షేమం, ఆర్‌డబ్ల్యుఎస్, పట్టణ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ఈ కార్యక్రమం ప్రతి పంచాయతీలోనూ నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా మండలంలోని 27 పంచాయతీల్లో అతిసారం ప్రభలే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఆయా పంచాయతీ కేంద్రాల్లో ఉన్న గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. వీధి కాలువల్లో మురుగునీటిని తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక దృష్టిని పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జగదీష్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా ఇన్చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఓ.ప్రభాకర్, కురుపాం డిఇఇ కె.నాగేశ్వరరావు, ఎఇ ప్రవీణ్ కుమార్, ఐకెపి ఎపిఎం ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' డబ్బులివ్వాలని ధర్నా

ప్రజాశక్తి– బొబ్బిలిరూరల్

నాల్గో విడత చేయూత డబ్బులు ఎన్నికల ముందు హడావిడిగా వైసిపి ప్రభుత్వం బటన్ నొక్కి ఇప్పటి వరకూ వేయలేదని వెంటనే ఆ డబ్బులను మహిళల ఖాతాల్లో వేయాలని మంగళవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు ఆధ్వర్యంలో మహిళలు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బటన్ నొక్కిన తరువాత ఎన్నికల కోడ్ రావడంతో కొందరికి డబ్బులు పడి కొందరికి పడక మహిళలు ఆందోళన చెందుతున్నారన్నారు.టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారం సందర్భంగా సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని అందులో భాగంగా చేయూత డబ్బులు వెంటనే రాని వారికి వాళ్ళ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ రవి కుమార్‌కు వినతి పత్రం అందించారు.

వందరోజులు పని కల్పించాలి

మండలంలోని రంగరాయపురం గ్రామంలో ఉపాధి హామీ పని వంద రోజులు ప్రభుత్వం ప్రకటించిన ఆ గ్రామంలో 100 రోజులు పని ఇవ్వకుండా ఆపేశారని ప్రభుత్వం ప్రకటించిన వేతనం కూడా అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఎపిఒ కలగజేసుకొని ప్రభుత్వం ప్రకటించిన పనిదినాలతో పాటు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎపిఒ బుధవారం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలా కానీ ఎడల గురువారం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగరాయపురం కార్యదర్శి ఉడముల ప్రసాదు మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి– బొబ్బిలి రూరల్

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం కృషి చేద్దామని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం' ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పిద్దాం నినాదంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. బడి అంటే అందరిదీ అనే భావనతో వెళ్ళాలనే లక్ష్యంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని తల్లిదండ్రులకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, బొబ్బిలి మండలం, పట్టణం ప్రధాన కార్యదర్శులు బత్తుల శ్రీనివాస్, రాధాకృష్ణ, మండలం అధ్యక్షులు మహేష్, సహాధ్యక్షులు అప్పలనాయుడు, జిల్లా నాయకులు సత్యన్నారాయణ, రెడ్డి రాంబాబు, మండల నాయకులు అనంత్, కృష్ణ దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి– బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించ వద్దని శానిటేషన్ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. పట్టణంలోని చీపురు పల్లివీధి, వెలమవారివీధిలో పారిశుధ్య పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. రోడ్లు, కాలువలలో చెత్త వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. వెలమవారివీధిలో ప్రైవేట్ స్థలంలో ఉన్న కల్వర్టు కూలడంతో వర్షం కురిస్తే నీరు సక్రమంగా వెళ్లకపోవడంతో స్థలం యజమానికి నోటీసులు జారీ చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి – గరుగుబిల్లి

మండలంలోని దళాయివలసకు చెందిన ఏగిరెడ్డి వెంకటరమణ (47) మంగళవారం అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం వెంకటరమణకు, భార్య భవానీల మధ్య గత కొంతకాలంగా చిన్నపాటి ఘర్షణలు జరుగుతున్నాయని, వీరిద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వెంకటరమణ సోమవారం తన పొలంలో పురుగుల మందు పిచికారీ చేసి ఇంటికి వచ్చారు. సాయంత్రం మద్యం సేవించి నిద్రపోయాడు. మంగళవారం ఉదయం ఆయన మృతి చెందినట్టు భార్య భవాని చుట్టుపక్కల వారికి తెలిపారు. దీంతో స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా, శరీరమంతా పలుచోట్ల గాయాలతో పాటు రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడు కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి – భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు నారాయణరావు (55) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. నారాయణరావు నిత్యం మద్యం సేవిస్తుండడంతో భార్య తరచూ మందలించేది. దీంతో ఈనెల 21న మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరం పెద్దాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు.

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి– విజయనగరం కోట

పట్టణంలోని డక్కిన వీధిలో రాజస్థాన్‌కు చెందిన భగవాన్ రాం నివాసం ఉంటూ, వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ నెల 14న రాజస్థాన్‌కు చెందిన బిజిలారామ్, మరి కొంత మంది భగవాన్ రాం నివాసం ఉండే ప్రాంతానికి వచ్చి, అతడితో మాట్లాడి, కారులో ఎక్కించుకుని తమ ఆడవారికి అసభ్యకర సందేశాలు పంపుతున్నారనే నెపంతో భగవాన్ రాంను తీవ్రంగా కొట్టి రూ.35వేలు దోచుకున్నట్లు సిఐ వెంకటరావు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దేవాసి వజీరామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిచినట్లు సిఐ తెలిపారు.